''సహచరుడిని తోడుగా పెట్టుకుని సాక్షీ మరియు సంతోషము అనే సింహాసనాధికారులుగా ఉండండి''

ఈ రోజు విశ్వ కళ్యాణకారి తండ్రి విశ్వములో నలువైపులా ఉన్న పిల్లలను చూసి హర్షిస్తున్నారు. పిల్లలందరి స్నేహము మరియు సహయోగము యొక్క రేఖలు పిల్లల ముఖము ద్వారా కనిపిస్తూ ఉన్నాయి. ప్రతి ఒక్కరి మనసు నుండి వచ్చే ''నా బాబా'' అన్న పాటను బాప్ దాదా వింటున్నారు. బాప్ దాదా కూడా బదులుగా 'ఓ నా అతి ప్రియమైన, అతి స్నేహీ అల్లారు ముద్దు పిల్లలూ' అని అంటారు. ప్రతి బిడ్డ ప్రియమైన బిడ్డ, అలాగే అల్లారు ముద్దు బిడ్డ కూడా, ఎందుకు? కోట్లలో కొందరు మరియు ఆ కొందరిలో కూడా కొందరు అయినవారు. కనుక అల్లారు ముద్దు పిల్లలయ్యారు కదా! బాప్ దాదా కూడా అల్లారు ముద్దు పిల్లలను చూసి సంతోషిస్తారు. పిల్లలను కూడా సదా సంతోషంలో నాట్యం చేస్తూ ఉండటాన్ని చూస్తున్నారు మరియు సదా చూడాలనుకుంటారు. సంతోషంలోనైతే ఉంటారు కానీ సదా అలా ఉండాలని తండ్రి కోరుకుంటారు. సదా సంతోషంగా ఉంటున్నారా లేక సంతోషంలో ఏమైనా తేడా వస్తుందా? ఒక్కోసారి చాలా సంతోషము, ఒక్కోసారి కాస్త తక్కువ మరియు ఒక్కోసారి చాలా తక్కువ అన్నట్లు ఉంటుందా!

తండ్రి ఇంతకుముందు కూడా వినిపించారు - వర్తమాన సమయములో విశ్వానికి పిల్లలైన మీ ద్వారా ఏ సేవ యొక్క అవసరముందంటే - ముఖము ద్వారా, నయనాల ద్వారా, రెండు మాటల ద్వారా ప్రతి ఆత్మ యొక్క దుఃఖాన్ని దూరం చేసి సంతోషాన్ని ఇవ్వండి. మిమ్మల్ని చూడటంతోనే సంతోషపడాలి, అందుకే సంతోషకరమైన ముఖము మరియు సంతోషకరమైన మూర్తి సదా ఉండాలి ఎందుకంటే మనసులోని సంతోషము ముఖము ద్వారా స్పష్టంగా కనిపిస్తుంది. ఎవరు ఎంతగా భ్రమిస్తూ ఉన్నా, వ్యాకులతతో ఉన్నా, దుఃఖపు అలలోకి వచ్చినా, సంతోషంగా ఉండటము అసంభవము అని భావించినా కానీ మీ ముందుకు రావటంతోనే మీ మూర్తి, మీ వృత్తి, మీ దృష్టి ఆత్మను పరివర్తన చేయాలి. ఈ రోజుల్లో మనసు సంతోషంగా ఉండేందుకు ఎంత ఖర్చు చేస్తున్నారు, మనోరంజనం కొరకు ఎన్ని కొత్త-కొత్త సాధనాలను తయారుచేస్తున్నారు. అవి అల్పకాలికమైన సాధనాలు మరియు మీది సదాకాలికమైన సత్యమైన సాధన. కావున ఈ సాధన ఆ ఆత్మలను పరివర్తన చేయాలి. అయ్యో-అయ్యో అని అనుకుంటూ వచ్చినవారు వాహ్-వాహ్ అంటూ వెళ్ళాలి. పరమాత్ముని యొక్క ఆత్మలది ఎంత అద్భుతము, వాహ్! అని అనాలి. ఈ సేవను చెయ్యండి. ఎప్పటికప్పుడు అల్పకాలిక సాధనాల ద్వారా ఎంతగా వ్యాకులపడుతూ ఉంటారు, అటువంటి సమయంలో మీ సంతోషము వారికి ఆధారంగా అవుతుంది ఎందుకంటే మీరు ఉన్నదే భాగ్యశాలురుగా. భాగ్యశాలురా కాదా? అసంపూర్ణంగా అయితే లేరు కదా? ఉన్నదే భాగ్యశాలురుగా. మీ వంటి భాగ్యశాలురుగా మొత్తం కల్పంలో ఇతర ఏ ఆత్మలూ లేరు. అంతటి నషాను ముఖము మరియు నడవడిక ద్వారా అనుభవం చేయించండి. చేయించగలరా లేక చేయిస్తూ ఉన్నారు కూడానా?

బ్రాహ్మణ జీవితంలో ఒకవేళ సంతోషం లేకపోతే బ్రాహ్మణులుగా అయ్యి ఏం చేసినట్లు! బ్రాహ్మణ జీవితం అనగా సంతోషము యొక్క జీవితము. అప్పుడప్పుడు బాప్ దాదా చూస్తూ ఉంటారు - కొందరి ముఖాలు ఎలా ఉంటాయంటే, అవి కాస్త... అప్పుడు ఏమవుతుంది? అది మీకు బాగా తెలుసు, అందుకే నవ్వుతున్నారు. బాప్ దాదాకు అటువంటి ముఖాలను చూసి దయ కూడా కలుగుతుంది మరియు కొద్దిగా ఆశ్చర్యం కూడా కలుగుతుంది. నా పిల్లలు, కానీ ఉదాసీనులా! ఇది సాధ్యమేనా? కాదు కదా! ఉదాసీనులు అనగా మాయకు దాసులు. కానీ మీరైతే మాస్టర్ మాయాపతులు. మాయ మీ ముందు అసలేమిటి? మామూలు చీమ కూడా కాదు, అది చనిపోయిన చీమ. దూరం నుండి చూస్తే అది బ్రతికి ఉన్నట్లు అనిపిస్తుంది కానీ వాస్తవానికి అది చనిపోయినది. కేవలం దూరం నుండే పరిశీలించే శక్తి కావాలి. ఏ విధంగా తండ్రి యొక్క జ్ఞానాన్ని విస్తారంగా తెలుసుకుంటారు కదా, అలా మాయ యొక్క బహురూపీ రూపాలను గుర్తించి, ఆ జ్ఞానాన్ని బాగా ధారణ చేయండి. అది కేవలం భయపెడుతుంది. ఏ విధంగా చిన్న పిల్లలు ఉంటారు కదా, వారిని నిర్భయులుగా చేయడానికి తల్లిదండ్రులు భయపెడతారు. నిజానికి ఏమీ చెయ్యరు కానీ కావాలని భయపెడతారు. అలాగే మాయ కూడా తనవారిగా చేసుకునేందుకు బహురూపాలను ధరిస్తుంది. మాయ బహురూపాలను ధరించినప్పుడు మరి మీరు కూడా బహురూపిగా అయ్యి దానిని పరిశీలించండి. పరిశీలించలేకపోతున్నారు కదా, అప్పుడు ఏ ఆటను ఆడుతారు? అయ్యో, మాయ వచ్చేసింది అని యుద్ధం చెయ్యటం

మొదలుపెడతారు. అలా యుద్ధం చెయ్యటం వలన మనసు-బుద్ధి అలసిపోతాయి. అప్పుడు ఆ అలసటతో ఏమంటారు? మాయ చాలా ప్రబలమైనది, మాయ చాలా తీవ్రమైనది అని అంటారు. అది అసలేమీ కాదు. మీ బలహీనతయే రకరకాల మాయా రూపాలుగా అవుతుంది. బాప్ దాదా సదా పిల్లలు ప్రతి ఒక్కరినీ భాగ్యపు నషాలో, సంతోషకరమైన ముఖంతో, సంతోషమనే ఔషధముతో ఆరోగ్యంగా ఉన్నట్లు మరియు సదా సంతోషపు ఖజానాలతో సంపన్నంగా ఉన్నట్లు చూడాలనుకుంటారు. జీవితంలో అసలేమి కావాలి? ఔషధము మరియు ఖజానా. వేరే ఇంకేమి కావాలి? మరి మీ వద్ద సంతోషమనే ఔషధము ఉందా లేక స్టాక్ ఎప్పుడైనా సమాప్తమైపోతుందా? సంతోషపు ఖజానా తరగనిది. తరగనిదే కదా? మరియు అది ఎంతగా ఖర్చు పెడతారో అంతగా పెరుగుతూ ఉంటుంది. ఒకవేళ వేరే ఏ పురుషార్థము చెయ్యకపోయినా కానీ, కేవలం ఒక్క లక్ష్యాన్ని పెట్టుకోండి - ఏం జరిగినా కానీ, మానసిక స్థితి ద్వారానైనా, ఇతర ఆత్మల ద్వారానైనా, ప్రకృతి ద్వారానైనా, వాయుమండలము ద్వారానైనా, ఏం జరిగినా కానీ నేను సంతోషాన్ని వదిలిపెట్టకూడదు. ఇది సహజ పురుషార్థమే కదా లేక సంతోషం జారిపోతుందా? సహజమేనా లేక అప్పుడప్పుడు కష్టమవుతుందా? దృఢ సంకల్పాన్ని ఉంచండి మరియు విషయాలను మర్చిపోండి. ఒకే విషయాన్ని పక్కాగా ఉంచుకోండి - నేను సంతోషంగా ఉండాలి. అప్పుడు ఇతర విషయాలు ఎలా అనిపిస్తాయి? ఆట. ఆటలను చూసేందుకు సాక్షీ స్థితి అనే మీ సీట్ పై సదా స్థితులై ఉండండి. ఎవరైనా మిమ్మల్ని అవమానపరిచేవారైనా లేక మిమ్మల్ని వ్యాకులపరచి మీ సాక్షీ స్థితి అనే గౌరవము నుండి కిందకు దించేవారైనా, మీరు సాక్షీ స్థితి అనే సీట్ నుండి కిందకు రాకండి. మీరు కిందకు వచ్చేస్తారు, అందుకే సంతోషము తగ్గిపోతుంది.

బాప్ దాదా ఇంతకుముందు కూడా రెండు మాటలను వినిపించారు - సహచరుడు మరియు సాక్షీ. బాప్ దాదా తోడుగా ఉన్నట్లయితే సాక్షీ స్థితి అనే సీట్ సదా దృఢంగా ఉంటుంది. బాప్ దాదా తోడుగా ఉన్నారు, బాప్ దాదా తోడుగా ఉన్నారు అని అనటానికి అందరూ అంటారు కానీ మాయ యొక్క ప్రభావం కూడా పడుతూ ఉంటుంది, మళ్ళీ ఏమో బాప్ దాదా తోడుగా ఉన్నారు, బాప్ దాదా తోడుగా ఉన్నారు అని అంటూ ఉంటారు. తోడుగా ఉన్నారు, కానీ సహచరుడిని అటువంటి సమయములో ఉపయోగించుకోరు, పక్కకు పెట్టేస్తారు. ఎలాగైతే ఎవరైనా తోడుగా ఉన్నప్పుడు ఒకవేళ ఏదైనా పనిలో బాగా బిజీ అయిపోతే లేక అలాంటి-ఇలాంటి విషయం ఏదైనా జరిగితే, అప్పుడు ఆ తోడుగా ఉన్నవారు గుర్తుండరు, విషయాలలో పడిపోతారు. ఆ మాటకొస్తే తోడుగా ఉన్నారు అని అంగీకరిస్తారు కూడా, అనుభవం కూడా చేస్తారు. తోడుగా లేరు అనే అనేవారు ఎవరైనా ఉన్నారా? ఎవ్వరూ అలా అనరు. అందరూ నాతోనే ఉన్నారు అని అంటారు, నీతో ఉన్నారు అని కూడా అనరు. ప్రతి ఒక్కరూ నాతో ఉన్నారు అనే అంటారు. నా సహచరుడు అనే అంటారు. ఇలా మనసుతో అంటారా లేక నోటితోనా? మనసుతో అంటారా?

బాప్ దాదా అయితే ఆటను చూస్తారు, బాబా తోడుగా కూర్చుని ఉన్నారు కానీ మీరు మీ పరిస్థితులలో, వాటిని ఎదుర్కోవటంలో ఎంతగా లీనమైపోతారంటే తోడుగా ఎవరు ఉన్నారు అన్నది కూడా చూడరు. మరి అప్పుడు బాబా కూడా ఏం చేస్తారు? బాబా కూడా సహచరుడి నుండి మారిపోయి సాక్షీగా అయ్యి ఆటను చూస్తారు. అలా చెయ్యకండి కదా. సహచరుడు అని అంటున్నప్పుడు ఆ తోడును నిర్వర్తించండి, పక్కకు ఎందుకు పెట్టేస్తారు? బాబాకు ఇది మంచిగా అనిపించదు. పిల్లలు ప్రతి ఒక్కరూ స్వరాజ్య అధికారుల నుండి విశ్వ అధికారులుగా అవుతారు అని బాబా ఈ శుభ ఆశను పెట్టుకుంటారు మరియు అది వాస్తవం కూడా. మీరేమైనా ప్రజలా! ప్రజలుగా అయితే అవ్వకూడదు కదా? మీరు రాజులు, మహారాజులు, విశ్వ రాజులు కదా! మీరు ప్రజలను తయారుచేసేవారు, అంతేకానీ ప్రజలుగా తయారయ్యేవారు కాదు. మీరు రాజులుగా తయారయ్యేవారు, ప్రజలను తయారుచేసుకునేవారు. మరి రాజు ఎక్కడ కూర్చుంటారు? సింహాసనంపై కూర్చుంటారు కదా! ప్రాక్టికల్ గా రాజు యొక్క నషాలో ఉన్నట్లయితే సింహాసనంపై కూర్చుంటారు కదా! కావున సాక్షీ స్థితి అనే సింహాసనాన్ని వదలకండి. వేరే-వేరే పురుషార్థాలేవైతే చేస్తారో వాటిలో అలసిపోతారు. ఈ రోజు మనసా చేసారు, రేపు వాచా చేసారు, సంబంధ-సంపర్కాలది చేసారు, ఇలా అయితే అలసిపోతారు. ఒకటే పురుషార్థము చెయ్యండి - సాక్షీ మరియు సంతోషము అనే సింహాసనాధికారులుగా ఉండాలి. ఈ సింహాసనాన్ని ఎప్పుడూ వదలకూడదు. ఎవరైనా రాజు చాలా సీరియస్ గా సింహాసనంపై కూర్చుని ఉంటే, కూర్చున్నది సింహాసనంపైనే కానీ వారు చాలా క్రోధంగా, అఫిషియల్ గా ఉంటే మంచిగా అనిపిస్తుందా? వీరు రాజు కాదు అని అంటారు. మరి మీరు సదా సింహాసనాధికారులే కదా! ఆ రాజులైతే ఒక్కోసారి సింహాసనంపై కూర్చొంటారు, ఒక్కోసారి కూర్చోరు, కానీ సాక్షీ స్థితి అనే సింహాసనం ఎటువంటిదంటే ప్రతి కార్యాన్ని చేస్తూ కూడా సింహాసనాధికారులుగా ఉండవచ్చు, కిందకు దిగాల్సిన అవసరం ఉండదు. నిద్రిస్తున్నా సింహాసనాధికారులు, లేస్తూ-తిరుగుతూ, సంబంధ-సంపర్కాలలోకి వస్తూ ఉన్నా సింహాసనాధికారులు. సింహాసనంపై కూర్చోవటం వస్తుందా

లేక రాదా, జారిపోతూ ఉంటారా? సాక్షీ స్థితి యొక్క సింహాసనాధికారిగా ఉన్న ఆత్మ ఎప్పుడూ ఏ సమస్యలోనూ వ్యాకులతకు లోనవ్వదు. సమస్య సింహాసనం కింద ఉండిపోతుంది మరియు మీరు పైన సింహాసనాధికారులుగా ఉంటారు. సమస్య మీ ముందు తలెత్తలేదు, కిందే అణిగి ఉంటుంది, మిమ్మల్ని వ్యాకులపరచదు. ఎవరినైనా అణిచేస్తే లోలోపలే సమాప్తమైపోతారు కదా. బాప్ దాదాకు అటువంటి సమయంలో ఆశ్చర్యమనిపిస్తుంది. మీరు ఆశ్చర్యపడకండి, మీ విషయంలో అశ్చర్యపడితే ఆశ్చర్యపడండి కానీ ఇతరులను చూసి కాదు. ఏం ఆశ్చర్యమనిపిస్తుందంటే - నా పిల్లలు అసలు ఏం చేస్తున్నారు, సింహాసనంపై నుండి దిగిపోతున్నారు. సింహాసనాధికారులుగా అయ్యే సంస్కారాన్ని ఇప్పటి నుండే అలవరచుకున్నట్లయితేనే విశ్వ సింహాసనంపై కూడా కూర్చుంటారు. ఇక్కడ సదాకాలికముగా సింహాసనాధికారులుగా ఉండకపోతే, అక్కడ కూడా సదా అనగా పూర్తి సమయమంతా కూర్చోలేరు. అన్ని సంస్కారాలనూ ఇప్పుడే నింపుకోవాలి. నింపుకున్న ఈ సంస్కారాలే సత్యయుగములో పని చేస్తాయి. రాయల్టీ యొక్క సంస్కారాలను ఇప్పటి నుండే నింపుకోవాలి. ఇప్పుడు ఇంకా కొంచెం సమయం ఉందిలే, ఇంతలోనే వినాశనమవ్వదులే అని అనుకోకండి. వినాశనం అకస్మాత్తుగా జరుగనున్నది. సరేనా, సిద్ధంగా ఉన్నారా అని అడిగి రాదు. అంతా అకస్మాత్తుగా జరుగనున్నది. మీరు కూడా బ్రాహ్మణులుగా ఎలా అయ్యారు? అకస్మాత్తుగానే సందేశం లభించింది, ప్రదర్శనీని చూసారు, సంబంధ-సంపర్కములోకి వచ్చారు, మారిపోయారు. ఈ తారీఖుకు బ్రాహ్మణులుగా అవుతాము అని ఏమన్నా ఆలోచించారా? అకస్మాత్తుగానే అలా అయ్యారు కదా! కనుక పరివర్తన కూడా అకస్మాత్తుగా జరుగనున్నది. ముందు మాయ మిమ్మల్ని ఇంకా నిర్లక్ష్యులుగా చేస్తుంది. ఎలా ఆలోచిస్తారంటే - మేమైతే 2000 సంవత్సరము అని అనుకున్నాము, అది కూడా పూర్తయిపోయింది, ఇప్పుడు కాస్త రెస్ట్ తీసుకుంటాము. ముందుగా మాయ తన గారడీని వ్యాపింపజేస్తుంది, నిర్లక్ష్యులుగా చేస్తుంది. ఏ విషయంలోనైనా, సేవలోనైనా, యోగంలోనైనా, ధారణలోనైనా, సంబంధ-సంపర్కములోనైనా - ఇది నడుస్తూనే ఉంటుంది, ఇది జరుగుతూనే ఉంటుంది... అని మొదట మాయ నిర్యక్ష్యులుగా చేసే ప్రయత్నం చేస్తుంది. తర్వాత అకస్మాత్తుగా వినాశనం అవుతుంది, అప్పుడు మళ్ళీ - బాప్ దాదా చెప్పనే లేదు, ఇలా కూడా జరుగుతుందా అని అనకండి. అందుకే ముందుగానే వినిపిస్తారు - ఎప్పుడూ ఏ విషయములోనూ నిర్ల్యక్షులుగా అవ్వకండి. నాలుగు సబ్జెక్టులలోనూ అలర్ట్ గా ఉండాలి. ఇప్పటికిప్పుడే ఏమైనా జరిగినా అలర్ట్. ఆ సమయములో మళ్ళీ - బాప్ దాదా, ఇప్పుడు రండి, ఇప్పుడు తోడుగా ఉండండి, ఇప్పుడు కాస్త శక్తినివ్వండి అని అనకండి, ఆ సమయములో ఇవ్వరు. ఇప్పుడు ఎంత శక్తి కావాలంటే అంత, ఏది కావాలంటే అది జమ చేసుకోండి. అందరికీ పూర్తి అవకాశం ఉంది, ఇది తెరిచి ఉన్న ఖజానా, ఎంత శక్తి కావాలంటే అంత, ఏ శక్తి కావాలంటే అది తీసుకోండి. పరీక్ష సమయంలో టీచర్ లేక ప్రిన్సిపాల్ సహాయం చెయ్యరు.

డబుల్ విదేశీ పిల్లలను చూసి తండ్రికి కూడా డబుల్ సంతోషము కలుగుతుంది. ఎందుకు కలుగుతుంది? ఎందుకంటే డబుల్ విదేశీయులకు స్వయాన్ని పరివర్తన చేసుకోవటంలో డబుల్ శ్రమ చెయ్యవలసి వచ్చింది. కనుక బాప్ దాదాకు డబుల్ విదేశీ పిల్లలను చూసినప్పుడు డబుల్ సంతోషము కలుగుతుంది. వాహ్ నా డబుల్ విదేశీ పిల్లలూ వాహ్! డబుల్ విదేశీయులు చేతులెత్తండి (విశ్వములోని అనేక దేశాలకు చెందిన సుమారుగా ఒక వెయ్యి మంది సోదర-సోదరీలు సభలో హాజరైయున్నారు). వాహ్, చాలా బాగుంది. డబుల్ చప్పట్లు మ్రోగించండి. బాప్ దాదా విదేశాలలోని సేవా సమాచారాన్ని వింటూ ఉంటారు, చూస్తూ కూడా ఉంటారు, రిజల్టులో సేవ యొక్క ఉల్లాస-ఉత్సాహాలు చాలా బాగున్నాయి. కేవలం అప్పుడప్పుడు స్వయంపై కొద్దిగా సేవ యొక్క భారాన్ని తీసుకుంటారు. భారాన్ని తీసుకోకండి. భారాన్ని బాబాకు ఇచ్చెయ్యండి. బాబాకు అసలు అది భారమే కాదు, కానీ మీరు సేవా భారాన్ని తీసుకున్నారంటే అలసిపోతారు. సేవను చాలా బాగా చేస్తారు, సేవ చేసే సమయంలో అలసిపోరు. ఆ సమయంలో చాలా మంచి ముఖాలతో ఫోటో తీసే విధంగా ఉంటారు. కానీ కొంతమంది (అందరూ కాదు) సేవ చేసిన తరువాత కాస్త అలసిపోయిన ముఖాలతో కనిపిస్తారు. బాబా అంటారు, భారాన్ని ఎందుకు ఎత్తుతారు. భారాన్ని ఎత్తటం మంచిగా అనిపిస్తుందా లేక అలవాటైపోయిందా? భారాన్ని ఎత్తకండి. బాబా తోడుగా లేనప్పుడు భారమనిపిస్తుంది. నేను చేసాను, నేను చేస్తాను అని అనుకుంటే భారమైపోతుంది. బాబా తోడుగా ఉన్నారు, బాబా కార్యము, బాబా చేయిస్తున్నారు అని అనుకుంటే భారముండదు. తేలికగా ఉంటూ నాట్యం చేస్తూ ఉంటారు. ఏ విధంగా డ్యాన్స్ చాలా బాగా చేస్తారు కదా. డబుల్ విదేశీయుల డ్యాన్స్ చూడండి, చాలా బాగుంటుంది. స్వయాన్ని అలసిపోయేలా చేసుకోరు, ఫరిశ్తాలలా చేస్తారు. భారతీయులు చేసే డ్యాన్స్ లో కాళ్ళు అలసిపోయేలా చేసుకుంటారు, చేతులు కూడా అలసిపోయేలా చేసుకుంటారు. అదే విదేశీయులైతే డ్యాన్స్ కూడా చాలా తేలికగా చేస్తారు. అలాగే సేవను కూడా ఒక డ్యాన్స్ లా భావించండి, ఆటలా భావించండి, అలసిపోకండి. బాప్ దాదాకు ఆ ఫోటో మంచిగా అనిపించదు. సేవ యొక్క

ఉల్లాస-ఉత్సాహాలు చాలా బాగున్నాయి. ఇప్పుడు చిన్న విషయానికే అలజడిలోకి వచ్చేవారి శాతం చాలా తక్కువగా ఉంది, ఈ రిజల్టు తండ్రి వద్ద ఉంది. మెజారిటీ బాగున్నారు, ఇకపోతే కొద్దిమంది మాత్రం అప్పుడప్పుడు కాస్త అలజడిలో కనిపిస్తారు. కానీ ఆది యొక్క రిజల్టులో మరియు ఇప్పటి రిజల్టులో చాలా మంచి తేడా ఉంది. అలానే కనిపిస్తుంది కదా? ఇప్పుడు నాజూకుతనాన్ని వదులుతూ ముందుకు వెళ్తున్నారు. బాప్ దాదాకు రిజల్టు చూసి సంతోషంగా ఉంది.

ఇప్పుడు చిన్న-చిన్న మైకులను కూడా తయారుచేస్తున్నారు. ఇప్పుడు చిన్న మైకులు ఉన్నారు, కానీ ఇప్పుడిక చిన్నవారి నుండి పెద్దవారిని తయారుచేసే వరకు కూడా చేరుకుంటారు. బాప్ దాదాకు గుర్తుంది - ఆదిలో విదేశీ టీచర్లు ఏమనేవారంటే - వి.ఐ.పి.లను కలుసుకోవటమే కష్టము, వారు రావటము సంగతి పక్కన పెట్టండి, వారిని కలుసుకోవటమే కష్టము. కానీ ఇప్పుడు సహజమైపోయింది ఎందుకంటే మీరు కూడా వి.వి.వి.ఐ.పి.లుగా అయిపోయారు, కావున మీ ముందు వి.ఐ.పి.లు ఎంత! పూర్తి విదేశాల రిజల్టు అంతా బాగుంది. సెంటర్లు కూడా బాగున్నాయి, వృద్ధిని చెందుతూ ఉన్నాయి. భారత్ లో హ్యాండ్స్ (సహయోగులు) లేరు, లేదంటే భారత్ లో కూడా సేవాకేంద్రాలు ఎన్నో తెరుచుకునేవి. హ్యాండ్స్ లేరు అని ప్రతి జోన్ వారూ అంటారు. కనుక ఈ సంవత్సరము హ్యాండ్స్ ను తయారుచేసే సేవను చెయ్యండి. హ్యాండ్స్ ను అడగటం కాదు, వారిని తయారుచెయ్యండి, మరింత దాన పుణ్యాలు చెయ్యండి.

విదేశాలలో ఇది చాలా మంచి పద్ధతి - ఎక్కడ సెంటర్ తెరుస్తే, అక్కడి నుండే లౌకిక కార్యాన్ని కూడా చేస్తారు, సెంటర్ ను కూడా నడిపిస్తారు. కనుక సెంటర్ ఎలా నడుస్తుంది, ఎవరు నడిపిస్తారు అన్న ఈ సమస్య తక్కువ ఉంది. మేము లౌకిక కార్యాన్ని ఎందుకు చెయ్యాలి అని మీరు ఆలోచించకండి. ఇది మీ సేవా సాధనము. మీరు లౌకిక కార్యాన్ని చెయ్యటం లేదు, కానీ అలౌకిక కార్యానికి నిమిత్తంగా అయ్యేందుకు లౌకిక కార్యాన్ని చేస్తున్నారు. ఎక్కడకు వెళ్ళినా సరే, అక్కడ సెంటర్ తెరవాలనే ఉల్లాసం ఉంటుంది కదా. కనుక లౌకిక కార్యాన్ని ఎప్పటివరకు చెయ్యాలి అని ఆలోచించకండి. లౌకిక కార్యాన్ని అలౌకిక కార్యం నిమిత్తం చేస్తారు కావున మీరు సమర్పణ అయినట్లే. అది లౌకికతనము కాదు, అలౌకికతనము, కనుక లౌకిక కార్యములో కూడా సమర్పణ అయి ఉన్నారు. లౌకిక కార్యాన్ని వదిలి సమర్పణ సమారోహాన్ని జరుపుకోవాలి అనేమీ లేదు. అలా చేస్తే వృద్ధి ఎలా అవుతుంది! అందుకే లౌకిక కార్యాన్ని చేస్తూ అలౌకిక కార్యానికి నిమిత్తులుగా అవుతారు, కనుక ఎవరైతే లౌకికాన్ని నిమిత్తంగా భావించి అలౌకికతలో ఉంటున్నారో, అలాంటి ఆత్మలకు డబుల్ ఏంటి, పదమాల రెట్లు అభినందనలు. కేవలం ట్రస్టీలుగా భావించి చెయ్యండి, నేను అన్న భావనలోకి రాకండి. నేను ఇంత పని చేస్తాను అని అనుకుంటూ నేను అనే భావన ఉండకూడదు. చేయించేవారు చేయిస్తున్నారు. నేను ఇన్స్ట్రుమెంటును. పవర్ ఆధారంగా నడుస్తున్నాను. అచ్ఛా.

ఈ రోజు డబుల్ విదేశీయుల టర్న్ కదా. మీకు కూడా డబుల్ విదేశీయులను చూసి సంతోషంగా అనిపిస్తుంది కదా! మరి డబుల్ విదేశీయులందరూ సంతోషంగా ఉన్నారా? చేతులతో చప్పట్లు కొట్టండి. ఇప్పుడు మధుబన్ లో అయితే మయ రాదు కదా?

అచ్ఛా, ఒక్క క్షణంలో పూర్తిగా తండ్రి సమానంగా అశరీరులుగా అవ్వగలరా? మరి ఒక్క క్షణంలో ఫుల్ స్టాప్ పెట్టండి మరియు అశరీరి స్థితిలో స్థితులవ్వండి (బాప్ దాదా 3 నిమిషాలు డ్రిల్ చేయించారు) అచ్ఛా, మొత్తం రోజంతటిలో పదే-పదే ఈ అభ్యాసము చేస్తూ ఉండండి.

నలువైపులా ఉన్న సర్వ మాయాజీతులు, ప్రకృతిజీతులు, సాక్షీ స్థితి యొక్క సింహాసనాధికారులు, సహచరుడి తోడును సదా అనుభవము చేసేవారు, సదా దృఢత ద్వారా సఫలతను మెడలోని హారంగా చేసుకునేవారు, సదా తండ్రి సమానంగా లైట్ గా ఉండేవారు, సదా తమ మైట్ (శక్తి) ద్వారా విశ్వాన్ని దుఃఖ-అశాంతుల బలహీనత నుండి విడిపించేవారు, ఇటువంటి మాస్టర్ సుఖ సాగరులు, సంతోష సాగరులు, ప్రేమ సాగరులు, జ్ఞాన సాగరులు అయిన తండ్రి సమానులైన పిల్లలకు ప్రియస్మృతులు మరియు నమస్తే.

వరదానము:- పరిశీలించే మరియు నిర్ణయించే శక్తి ద్వారా సేవలో సఫలతను ప్రాప్తి చేసుకునే సఫలతామూర్త భవ

ఎవరైతే పరిశీలనా శక్తి ద్వారా తండ్రిని, స్వయాన్ని, సమయాన్ని, బ్రాహ్మణ పరివారాన్ని మరియు తమ శ్రేష్ఠ కర్తవ్యాన్ని గుర్తించి, ఎలా తయారవ్వాలి మరియు ఏం చెయ్యాలి అని నిర్ణయిస్తారో, వారే సేవలు చేస్తూ, కర్మలు మరియు సంబంధ-సంపర్కాలలోకి వస్తూ సదా సఫలతను ప్రాప్తి చేసుకుంటారు.

మనసా-వాచా-కర్మణా అన్ని రకాల సేవలలో సఫలతామూర్తులుగా అయ్యేందుకు ఆధారము పరిశీలించే మరియు నిర్ణయించే శక్తి.

స్లోగన్:- జ్ఞాన-యోగముల లైట్-మైట్ తో సంపన్నముగా అయినట్లయితే ఎటువంటి పరిస్థితినైనా క్షణములో దాటి వేస్తారు.